

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 21 మార్చి-2025 సంచిక : 10

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**
**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**
**ప్రధాన సంపాదకత్వం :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ**
**ప్రత్యేక సహకారం :**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**
**శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)**
**ప్రచార సారథ్యం :**
**శ్రీ బి. గోపీకృష్ణ**
**శ్రీమతి బులుసు జయ**

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
**సాయిధామం, బొమ్మల రామవరం మండలం,**
**యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.**
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .................... 2
శ్రీ సాయి నిత్య పారాయణ .................... 5
శాశ్వత ధర్మగోప్త .................... 7
సాయిభక్త దాసగణు .................... 10
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 13
DECLARATION .................... 16
సీతాదేవి ఆకాంక్షించిన .................... 17
ఎవరు సేవకులు? .................... 21
బాలవాణి .................... 23
వివాహం-సంసారం .................... 26
గురుదేవుల జన్మదినం .................... 28
కృష్ణారావు కుటుంబాన్ని .................... 29

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



## ఉగాది

సాయి బంధువులందరికీ నూతన సంవత్సర (విశ్వావసు నామ సంవత్సరం) శుభాకాంక్షలు. శ్రీసాయినాథుల వారు ఈ సంవత్సరంలో సాధక లోకానికి ఇతోధికమైన ప్రగతిని ప్రసాదించాలనీ, స్వచ్ఛమైన భక్తిని సాధించుకోగల శక్తినివ్వాలనీ “సాయివాణి” ప్రార్థిస్తున్నది.

మరో సంవత్సరం గడిచిపోయింది. కొంచెం కటువుగానే ఉన్నప్పటికీ కొన్ని సత్యాలను నిర్భీకంగా, నిస్సంకోచంగా చర్చించుకోగలగాలి ఇలాంటి పర్వదినాన. సాధారణంగా పండగలు, పబ్బాలు అనగానే పిండివంటలు, క్రొత్త బట్టలే గుర్తు వస్తాయి అందరికీ. ఏ కొంతమందికో బంధుమిత్రులు, ఉత్సాహం గుర్తువస్తే కొద్దిమందికి మాత్రమే దైవం, ఆనాటి పూజా విశేషాలు వగైరాలు గుర్తు వస్తాయి. అందులో కూడా అతి కొద్దిమందికి మాత్రమే ఆ ప్రత్యేకదినాన తానేమి ఆత్మవిచారం చేసుకోవలసిందీ గుర్తుకు వస్తుంది. అయితే మరి మనం సాయీభక్తులమై ఉండి కూడా ఇతరులవలెనే ప్రవర్తించితే ప్రయోజనం ఏముంటుంది? మనం ఇలా ఆలోచించి చూచుకొందాం.

ఉగాది నాటికి వచ్చే క్రొత్త క్రొత్త పంటలలో కొన్నింటిని కలిపి షడ్రుచులతో ఉగాది పచ్చడి తినటం తెలుగువారికి ఆచారం. తింటూ మన అంతర్యంలో ఒక ప్రమాణం చేసుకుంటున్నామన్నమాట. ఈ నవ వత్సరంలో నాకు కలగబోయే ఏ అనుభవాన్నైనా-అది వేపపువ్వంత చేదేగానీ, చెరుకు

ముక్కంత తీపేకానీ-ఈ రెంటికీ మధ్యగా ఉండే పులుపు, వగరు వంటివే వైనా సరే-సమంగా తీసుకుంటాను, అన్నీ భగవత్ప్రసాదంగానే తీసు కుంటాను అని మన మనసులో ఒక సంకల్పం చేసుకోవటమే దాని అర్థం. అది కూడా దేవునికి నివేదించి తీసుకుంటాం. అంటే దేవుడి ముందు ప్రమాణం చేస్తున్నట్లే గదా! మరి మనం ఆ ప్రమాణం నిలుపు కొంటున్నామా? ఈ విషయం ప్రతినెలా ఒక్కసారైనా మననం చేసుకోవటం అవసరం అలా చేద్దాం.

అయితే మనం యీనాడు గుర్తు చేసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం ఒకటుంది. ఆయనకు ఇన్నేళ్ల వయసు అనాలంటే “ఇన్ని వసంతాలు చూచిన మనిషి” అంటారు. అంటే మన వయస్సు గడుస్తున్న కొలత వసంతఋతువుతో కొలుచుకుంటున్నాం. ఒక వసంతం గడిచింది అంటే మన జీవితంలోనుంచీ ఒక ఏడాది తరిగిపోయిందన్నమాటే గదా! ఈ సంగతి మనకు స్పృహలోకి వస్తున్నదా?

పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ విద్యా ప్రకాశానందగిరి వారు అంటారొక చోట-గూడ్స్ రైలు పెట్టెలను తయారుచేసి లైను మీదికి పంపేటప్పడే అది తిరిగి షెడ్‌లోకి రావలసిన డేట్లు వాటి మీద ముద్రవేసి పంపిస్తారు. ఆ డేట్‌కు అది ఖచ్చితంగా వెనక్కు వెళ్లాలి. ఆ తరువాత అది పనికిరాదు. అలాగే మనం యీ లోకంలోకి వచ్చినప్పడే భగవంతుడు మనం తిరిగి వెళ్లవలసిన తేదీ క్షణాలతో సహా ముద్రగొట్టి మరీ పంపిస్తాడు. ఆ క్షణం తరువాత మరొక్క అరక్షణం కూడా ఉంచడు. ఆ సంగతి మనం ప్రతి ఉగాదినాడూ గుర్తు చేసుకోవాలి. శుభమా అని పండగపూటా యీ చావు గోలేమిటీ అనిపిస్తుండవచ్చు కొందరికి. కానీ మరణమే అతి సహజమైన ప్రకృతి, జననం వికృతి. ఇది తిరగేసి చదువుకొని మనం మాయలో



సాయి వాణి

పడుతుంటాం. పరుగు పందెంలో పాల్గొనే వాడికి తన దృష్టి ఫైనల్ గీత మీదనే ఉండాలని తెలుసు. మనక్కూడా అటువంటి కడపటి గీత ఒకటి గీసే ఉంది. మనం నడిచేకొద్దీ దానికి దగ్గరవుతూ ఉంటాం. అంటే గడుస్తున్న ప్రతి క్షణం కూడా మన ఆయుర్దాయంలో తరిగిపోతూ మనకు కడపటి క్షణానికి దగ్గర చేస్తూ ఉంటుంది. ప్రతి నిత్యం ఏవో కార్యకలాపాల్లో కూరుకుపోయే ఉంటాం గనుక కనీసం ఉగాది నాడైనా యీ విషయాన్ని గుర్తు చేసుకోవాలి గదా! అంచేత ఏదో ఒక టైమ్‌లో వీలు చూచుకొని ఒక్క గంట సేపు మనం ఏకాంతంగా ఉండే అవకాశం కల్పించుకోవాలి. అప్పడు ప్రశాంతంగా ఆలోచించుకోవాలి.

“నా జీవితంలో మరో సంవత్సరం గడిచిపోయింది. అంటే మోక్షసాధన కోసం, మానవ జీవిత పరమార్థాన్ని సాధించటం కోసం నాకు కేటాయించ బడిన సమయంలో మరో ఏడాది తరిగిపోయింది. ఇక నేను తొందర పడకపోతే యిలాగే మిగతా కాలం కూడా కరిగిపోతుంది. మనిషినై పుట్టి కూడా వ్యర్థుడనైపోతాను.......... ఇలా ఆలోచిస్తూ - యింకా మనసులో ఏయే దుర్గుణాలు, దౌర్బల్యాలు ఉన్నాయో విశ్లేషించి చూచుకోవాలి. వాటిలో ఏవేవి యీ సంవత్సరంలో వదులుకోవాలో ఎంచుకోవాలి. ఎలా పోగొట్టుకోవాలో ప్లాన్ చేసుకోవాలి. ఆ ప్రకారం నడుచుకోగల శక్తినిమ్మని శ్రీసాయినాథుని ప్రార్థించాలి. అటుపైన మన నిర్ణయాలను ఖచ్చితంగా అమలుపరచుకోవాలి. అదే మనం ఉగాది పచ్చడి తిన్న ఫలితం.

అలా మనమందరం మరొక్క అడుగైనా యీ విశ్వావసు సంవత్సరంలో ముందుకు వేయగల శక్తిని బాబా మనకివ్వాలని ప్రార్థిద్దాం.

- : శుభమస్తు :-

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము

రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. అనుచు తలచినంత నతనికనియె సాయి
ఉల్లి తినగ జీర్ణ మొంద గలుగు
శక్తి గలుగు వాడె సంశయంబును లేక
తినగ వలయు ననుచు తెలియ జేసె 5

తే.గీ. సాయి సర్వజ్ఞు డనుచును సంతసించి
యోగి హృద్ధ్యాన గమ్యుని యోగ వరుని
సాయి నాధుని సర్వశ్శ శరణు గోరె
శరణు నొంద దీరె యోగి శంకలన్ని 6

తే.గీ. గురుని మదిలోని తలపును గురతెరింగి
తటపటాయింపు లేకుండ తడవు లేక
యిదియె గురుదేవు నాజ్ఞగా యిష్టపడుచు
జేయు నతడేను యుత్తమ శిష్యుడనగ 7

తే.గీ. ఆలసించక గురుదేవు నాజ్ఞ దీర్చు
శిష్యు మధ్యముండనగాను జెందు నిలను
ఆజ్ఞ నెరవేర్చకుండగా నటునిటుజను
శిష్యు నేమన వచ్చును శెలవునిండు 8

ఆ.వె. తనువు మనము లేవి తనవి గాదనుచును
గురుని పదము జెంత కూర్చియుంచి
సేవ జేయు నతడె శిష్యవరుండౌను
బుద్ధి కుశలతమున సిద్ధినోందు 9

ఆ.వె. గురువు చెప్పమాట గురిగాను వినవలె
నటుల వినని వాడు నల్పుడగును





అవును కాదు యనక ఆజ్ఞను పాలించు
శిష్య వరుడు వాడె సిద్ధి బొందు 10

ఆ.వె. మేక నొకడు తేవఁ మెడ నరక మనుచు
బాబపీరు కనియె బాబసాయి
వలదు దాని జంప వలదంచు బడెబాబ
నరకు జేయ లేదు సాయి నాజ్ఞ 11

తే.గీ. సాయి శ్యామాకు జెప్పగ సమ్మతించి
తటపటాయించుచు నతడు తప్పకొనియె
దీక్షితు నడుగ గురునాజ్ఞ దీర్చగాను
సిద్ధ మయ్యెనతడు మేక శిరము నరక 12

ఆ.వె. పంజరంబు నందు పక్షియే జీవుఁడు
బంధి యగును కాయ పంజరమున
యిదియె బాగుయనుచు యీప్సితముల దేలు
గూడు విడచు దనుక గురుడు లేక 13

తే.గీ. "ఫో", "వెడలి పొమ్ము. దిగువకు పొమ్ము"నుచును
పాము విషమును దించెను బాబ నాజ్ఞ
శ్యామ! భయము వలదు శాంతి బొందమనుచు
గృహము కనిపెను శ్యామాను గురుడు సాయి 14

ఆ.వె. నమ్మి కొలుచు వారి నావయై దరిజేర్చు
యిహము పరము నొసగు నీప్సితంబు
కష్టములను బాపి కాపాడు సాయీశు
కరుణ జూప మనుచు కాళ్ల బడుదు 15

తే.గీ. భయము కలిగించు కలరాను బాపి సాయి
ధునికి కట్టెలు తెప్పించు ధూర్త మనక
కాచె శిరిడీన వ్యాధులు కలుగ కుండ
సాయి నెదిరించ నెవరికి శక్తి గలదు 16

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

**(గత సంచిక తరువాయి)**

సాల్వుడు ప్రబల పరాక్రమి. అతనికి జలపోతాల పిండు ఉన్నది. వానిలో 'సౌభం' అనేది పెద్ద నావ. దానిని కామగం అని కూడా అంటారు. శిశుపాలుణ్ణి నేను వంచనతో చంపానని, అతని వర్గం ప్రచారం చేశారు. నేను ఇంద్రప్రస్థంలో ఉన్నాను. అక్కడ వాళ్లు మహావేగం తరలిపోయి ద్వారకపట్టణం మీద నానా ధ్వంసకాండను రచించారు. స్త్రీ, బాల, వృద్ధులను బాధించారు. ఇండ్లకు నిప్ప పెట్టారు. 'ఏడీ, ఆ దొంగ కృష్ణుడు, వాణ్ణి హతమారుస్తానని రెచ్చిపోయినాడు' అని సాల్వుని ఆగడాన్ని గురించి చెప్పనారంభించాడు.

'మరి, మిగతా యాదవ ప్రముఖులు లేరా?' అని భీముడడిగాడు.

'అతిరథులందరూ ఇక్కడ ఉన్నారు గదయ్యా! నాకు కబురందడం తోటే ద్వారకకు చేరుకున్నాను. సాల్వున్ని వధించాలని నిశ్చయించుకొని, ప్రద్యుమ్నుణ్ణి అతని సేనాపతి వజ్రనాభుని పైకి పంపాను. అప్పటికే పూజ్యులు మా నాయనగారిని సాల్వుడు బంధించి తన రాజధాని మాత్ర్య కోవిటలో నిర్బంధంలో ఉంచారు. ఇరవై తొమ్మిది రోజులు సాగిన ఆ యుద్ధంలో ప్రద్యుమ్నుడు నాయనగారు వసుదేవుల వారిని బంధించి ఉంచిన కోటను నేలమట్టం చేసి వారిని తిరిగి ద్వారకకు తెచ్చాడు. నేను సాల్వుణ్ణి నా చక్రఘాతానికి బలి చేశాను' అని క్షణం ఆగి, 'సార్వభౌమా! ఆ దుర్మార్గుడు ప్రభాసంలో విరాజిల్లిన సోమనాథుని పవిత్ర దేవాలయాన్ని కూడా విడిచి పెట్టలేదు. ఆ ఆలయాన్ని తిరిగి బాగుచేయించాల్సి ఉంది. ఆ హడావిడిలో ఉండగా ఈ దుర్వార్త నాకు తెలిసింది. అందుకే నాకు హస్తినలో నడిచిన వ్యవహారాలు వేళకు తెలియరాలేదు. ఇప్పుడు అనుకొనీ ప్రయోజనం లేదు'.





ఆ సాయంత్రం - రాత్రి ముందు జరుగవలసిన వ్యవహారాన్ని గురించి తీవ్రంగా, వివరంగా సమాలోచనలు జరిపారు. ద్రుపద సైన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. కామ్యకంలో, పాండవుల నివాసస్థలాలలో అడవులలో నిరంతరం జాగ్రత్త వహించే చార సమాచార వ్యవస్థ ఏర్పడాలి. ఎప్పటికప్పుడు హస్తిన కదలికలను కనిపెట్టి ఉండాలి. వనవాసంలో కావలసిన అవసరాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయడానికి కూడా నిత్య జాగరూకంగా ఉండే ఏర్పాట్లు జరగాలి అని నిశ్చయించుకున్నారు.

దుష్ట కేతువు. కేకయ సోదరులు నిత్యసంసిద్ధులమై ఉంటామని అన్నారు. పాండవులు తమ కదలికల్లో ఎక్కువ జాగ్రత్త వహించాలి. వెంట నున్న శ్రోత్రియులను కృష్ణుడు నచ్చజెప్పి హస్తినకు తిరిగి పంపాడు. మీరిక్కడ ఉంటే మీ రక్షణకు ఎప్పుడూ వారు నిర్నిమేషంగా సమయం గడపాలి. వీరు ఒకేచోట ఉండగూడదు అని ఉద్బోధించాడు శ్రీకృష్ణుడు. అయినా కొందరు శ్రోత్రియులు ససేమిరా మేము చక్రవర్తి సార్వభౌములు యుధిష్ఠిరుల వారి వెంటనే ఉంటామన్నారు. వీడ్కోలు సమయమైంది. శ్రీకృష్ణుని భార్యలు ద్రౌపదిని కౌగిట బంధించారు. సుభద్ర ఆమెను విడిచి వెళ్లడానికి విలవిలలాడింది. శ్రోత్రియులు కంట తడిపెట్టుకొని, విధిలేక ముక్తకంఠంతో ఆశీర్వదించి అగ్నులు పట్టుకొని బయలుదేరారు. దృష్టద్యుమ్నుడు పాంచాలి సంతానాన్ని కాంపిల్యానికి తీసుకొని వెళ్లడానికి సిద్ధమైనాడు. సాత్యకి మొదలగు యాదవ వీరులతో శ్రీకృష్ణుడు సపరివారంగా ద్వారకకు బయలుదేరారు.

✡ ✡ ✡

## 14. ద్వైతవనానికి

కామ్యకం హస్తినాపురానికి అందుబాటులో ఉన్న ఒక ఘనారణ్యం. అక్కడ ఆ వనంలోకి ప్రవేశించగానే భీముడు కిమ్మీరుడనే రాక్షసుణ్ణి చంపాడు. ఆ తరువాత ఆ వనంలో ప్రశాంతి నెలకొన్నది. వనవాసులకు భద్రత చేకూరింది.

హస్తిన కంత దగ్గరలో ఎక్కువ రోజులు ఉండకూడదని పాండవులనుకున్నారు. జనం రాకపోకల ఒత్తిడి కూడా ఎక్కువైంది. ఎక్కడో దూరంగా ప్రకృతి ఒడిలో ప్రశాంత గంభీర వాతావరణంలో కాలక్షేపం చేయాలని ధర్మరాజు నిర్ణయించుకున్నాడు. తమ్ములతో, ధౌమ్యుల వారితోనూ సంప్రదించాడు. అర్జునుడు పూర్వం తీర్థయాత్రలు చేసినప్పుడు సరస్వతీ తీరాన గల ద్వైతవనాన్ని చూచాడు. చివరకు అక్కడికి వెళ్దామనుకున్నాడు.

ద్వైతవనంలో ఋషులు, తాపసుల ఆశ్రమాలు చాలా ఉన్నాయి. అది నేర్పుతో తీర్చిదిద్దిన రమణీయమైన ఉద్యానవనంలా ఉంటుంది. చుక్కల్ని శిఖలలో పూలుగా తురుముకున్న మహావృక్షాలు, ఋతురాగమెరిగి గుండె విచ్చుక వికసించే సుమలతలు, స్వాదిష్టములైన వివిధ ఫలవృక్షాలు, మధుర జలధారలు, ఆల దూడల అంభారావాలు, పక్షుల కలకల మధురాలాపాలు, ఆ వనాన్ని ప్రశాంత మనోహరంగా తీర్చిదిద్దాయి. శాంతి దేవత ప్రసన్నంగా తన ఒడిలో పదిల పరుచుకున్నట్లుగా ఉన్న ఆ ప్రదేశంలో పాండవులు సహచరులతో ఆగిపోయారు.


ద్వైతవనంలో ఉన్న వనవాసులు, ఋషులు మిగతా ఆశ్రమవాసులు పాండవుల రాకను గురించి తెలియగానే ఎదురేగి ఎంతో గౌరవాదరాలతో స్వాగతించారు. ఆ స్వాగతించిన వారిలో రాజసూయానికి వచ్చిన వారున్నారు. వారందరూ పాండవులకు జరిగిన అన్యాయాన్ని గురించి కూడా వినే ఉన్నారు. ఆశ్రమ మహిళలు ద్రౌపదిని తమ లోగిళ్లలోకి వాత్సల్య ప్రేమలతో తీసుకొనివెళ్లారు.

ద్వైతవనంలో ఒకవైపున సాలవృక్షాల ఛాయల్లో పాండవులు తమకు, తమ వెంట వీడని శ్రోత్రియులకు, ధౌమ్యులవారికి పర్ణకుటీరాలను ఏర్పాటు చేసుకున్నారు. చక్కని ప్రశాంత వాతావరణం, తపస్వుల సన్నిధి, నిత్య నియమిత కర్మానుష్ఠాలు, సత్కథా కాలక్షేపాలు, శాస్త్రచర్చలు, ధర్మ మీమాంసలు, సదుపదేశ శ్రవణ మననాదులు. అలా కాలం గడుస్తున్నది.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

**రచన : విజయ కిషోర్**

**(గత సంచిక తరువాయి)**

కమలాన్నుండి ఉద్భవించిన బ్రహ్మదేవుడు, లక్ష్మీపతి అయిన విష్ణుదేవుడు మరియు శివుని యొక్క ఏకత్రరూపమై నీవు ఈ భువిపై సంచరిస్తావు. ఆ త్రిమూర్తుల వద్ద ప్రకటమయ్యే అన్నీ లీలలు నీ వద్ద ప్రకటమవుతుంటాయి. అయినప్పటికీ, నా మనసు ఎప్పుడూ చంచలమవుతుంటుంది. ఓ సాయిదేవా, నాదొక నమ్ర వినతి! నా ఈ చంచలమైన మనస్సును స్థిరీకరించి మీ చరణాలపై నాకు భక్తి కుదిరేటట్లు చేయండి!

అధామాధముడను, మహాపాపిని అయిన నేను మీ చరణాలకు శరణు చెందుతున్నాను. ఓ గురురాయా! ఈ భవసాగరంలోని త్రితాపాలను నివారించుకోవడానికై వచ్చాను.

శ్రీసాయి తమ భక్తులకు ప్రసాదించిన అసంఖ్యాకమైన అద్భుత లీలలలో తలమానికంగా ఎన్నదగిన ఈ లీలలో వివేచించవలసిన ఎన్నో అంశాలు నిక్షిప్తమై ఉన్నాయి. శ్రీసాయి కీర్తికిరీటంలో కలికితురాయి వంటి ఈ లీలలో అపూర్వమైన ఆధ్యాత్మిక సత్యాలు నిబిడీకృతమై ఉన్నాయి. తాము ఉద్ధరించవలసిన శిష్యునిలో బలంగా వేళ్లూనుకొనియున్న బలహీనతలను, ఛాందస భావాలను తొలగించడానికి ఘటనా ఘటన సమర్థుడైన సద్గురువు ఏ విధంగా అఘటిత ఘటనలను ఘటింపజేస్తారో తెలియజెప్పేందుకు ఈ లీల ఒక మచ్చుతునక! విశేషపర్వదినంనాడు, పవిత్ర గోదావరిలో దాసగణు మునక అనే సారాంశం కలిగిన ఈ దైవ ఘటనలో మనం మునక వేసి, అపూర్వమైన "సాయిబోధ" అనే అమూల్యమైన రత్నాన్ని దొరకబుచ్చుకుందాం, రండి!

**మొదటిది :** బాబా దేహధారియైయున్న రోజులలో ప్రతిరోజు మధ్యాహ్న

ఆరతికి ముందు భక్తులు బాబాకు విధిపూర్వకమైన పూజ చేసుకొనేవారు. ఆ విధి పూర్వక పూజలో భాగంగా భక్తులకు బాబా చరణాలను ఒక వెండి పళ్ళెంలో పెట్టి, నీటితో కడిగేవారు. తరువాత ఆ జలాన్ని బాబా చరణ తీర్థంగా అక్కడ ఉపస్థితమైయున్న భక్తులందరికీ పంచేవారు. భక్తులందరూ ఎంతో భక్తిపూర్వకంగా ప్రేమ భావంతో ఆ తీర్థాన్ని సేవించే వారు. (మొదటి రోజుల్లో ఆ తీర్థాన్ని మేఘుడు తరువాతి రోజులలో శ్రీ బాపుసాహెబ్ జోగ్ భక్తులందరికీ పంచేవారు.) కానీ, అర్థంలేని ఛాందస భావాలు-గోడలకు పట్టిన బూజువలే-హృదయంలో వేలాడుతున్న కొందరు భక్తులు ఆ తీర్థాన్ని సేవించేవారుకారు. వారిలో దాసగణు, కృష్ణజోగేశ్వర్ భీష్మ వంటి భక్తులు ఉండేవారు. తరువాత తనకు వచ్చిన అనుభవాల వలన కృష్ణజోగేశ్వర్ భీష్మ, సకల జాతి, మత ధర్మాలకు అతీతుడైన భగవంతుడే సాక్షాత్తూ శ్రీ సాయి రూపంలో నడయాడుతున్నారనే విశ్వాసం ఏర్పడడంతో, తరువాతి రోజులలో తనకు తానుగా అడిగి మరీ బాబా చరణ తీర్థాన్ని పుచ్చుకొనేవారు. కానీ, దాసగణు మాత్రం ఎన్నడూ ఆ తీర్థాన్ని సేవించేవాడు కాదు. కారణం, బాబా ఒక ముస్లిం ఫకీరు అనే భావం హృదయపు లోతుల్లో బలంగా వేళ్ళూనుకొనియుండడమే!

ఎన్నో అద్భుతమైన దివ్యానుభవాలను బాబా వద్ద పొందినా మరియు సాక్షాత్తూ ఆ భగవంతుడే షిరిడీ సాయిబాబా రూపంలో నడయాడుతున్నాడని తన సంకీర్తనలలో గానం చేసినా దాసగణులో ఇటువంటి భావం ఇంత బలంగా ఉండటం సహజంగానే ఎంతో విస్మయానికి గురిచేస్తుంది.

కానీ, బాబా మాత్రం దాసగణు ప్రవర్తన పట్ల చిరునవ్వు నవ్వేవారే కానీ, ఎన్నడూ తనపై కోపించడం లేదా తనకు బోధించడం వంటివి చేసేవారు కాదు. ఒకసారి బాపూసాహెబ్ జోగ్ "అందరూ మీ చరణతీర్థం పుచ్చుకుంటున్నా, దాసగణు మాత్రం తీసుకోవడం లేదని" బాబాకు ఫిర్యాదు చేస్తే, బాబా చిరునవ్వు నవ్వి **"తన భావాలను మనం గౌరవించుదాం"** అని





మాత్రమే అన్నారు. సాక్షాత్తూ బాబా ఆదేశించినా దాసగణు అందులో సూక్ష్మోపాయం వెదకేవాడే గానీ, తన ఛాందస భావాలను మాత్రం వదలు కునేవాడు కాదు. ఒక చిన్న ఉదాహరణ ...

దాసగణు ఉల్లిపాయలను తినేవాడు కాదు. బాబా ఒకసారి **"ఉల్లిపాయలతో పులగం చేసి, నీవు తిని నాకు తీసుకురా"** అని ఆదేశించారు. దాసగణు పులగాన్ని తయారుచేసి, ఉల్లిపాయలతో చేయడం వలన పులగం తినడం ఇష్టం లేని దాసగణు, అందుకు ప్రత్యామ్నాయంగా చూపుడు వేలితో ఆ పులగాన్ని తాకి, ఆ వేలును తన పెదవులకు తాకించి ఆరగించినట్లుగా సంకల్పించుకున్నాడు. తరువాత బాబా వద్దకు ఆ పులగాన్ని తీసుకువెళ్ళినప్పుడు, **"ఏం గణూ! నీవు తిన్నావా?"** అని అడిగారు. అందుకు **"ఆ తిన్నాను బాబా"** అని దాసగణు సమాధానం ఇచ్చాడు. అప్పుడు బాబా నవ్వుతూ **"ఏది ఇలా తిన్నావా"** అని అచ్చు దాసగణు చేసినట్లే చేసి చూపించారు. ఆశ్చర్యంతో అవాక్కయిన దాసగణు నోటినుండి మాట పెగల్లేదు. బాబా యొక్క సర్వాంతర్యామి తత్వం పదే పదే అనుభవమవుతున్నా సరే వదలించుకోలేనంత బలంగా దాసగణులో ఆ ఛాందస భావాలు వేళ్లూనుకొని ఉన్నాయి. అలా అని దాసగణుకు సకల ధర్మాత్ముడైన శ్రీ సాయి వద్ద వీటితో పనిలేదని దాసగణుకి తెలియదా అంటే, తాను వ్రాసిన పై కవితలో "మీరు ఎన్ని అనుభవాలు ప్రసాదించినా సరే, నా మనసు ఎల్లప్పుడూ చంచలమవుతుంది. నా మనసును స్థిరీకరించి మీ చరణాల వద్ద నాకు భక్తిశ్రద్ధలు కుదిరేటట్లు చేయండి" అని ప్రార్థించడంలోనే దాసగణు హృదయంలో పరస్పర విరుద్ధ భావాల మధ్య జరిగిన ఘర్షణ మనకు అవగతమవుతుంది.

సాధకుని హృదయంలో పరస్పర విరుద్ధ భావాలు నిరంతరం ఒక దానిపై ఒకటి విజయం సాధించడానికి ఎంతగా పోరాడుతుంటాయోననే సత్యానికి దాసగణులోని ఈ భావమే నిలువెత్తు తార్కాణం. **(సశేషం)**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

**(గత సంచిక తరువాయి)**

ఈ భావాలకి మీరు దూరంగా ఉండండి. నెగిటివ్ భావాలున్న వాటిని చూడకండి. వినకండి. అవి మన మనస్సుకు హానికరమని డాక్టర్ లిప్టన్ వివరించాడు. మనిషి ఆత్మ పరిశీలన ద్వారా ఇచ్ఛాశక్తితో తన ప్రవర్తన గుణాలని మార్చుకోవచ్చన్నాడు డాక్టర్ లిప్టన్.

ఉద్రేకం, కోపం, హింస, అసూయ, అహంకారం, ద్వేషం, మోసం, చింతలను తీసుకొని అవి మన అచేతన మనస్సులో స్టోర్ చేస్తుంది. ఈ అచేతన మనస్సు నిండినప్పుడు, అవి మనకు తెలియకుండానే మన కంట్రోల్ తప్పి విజృంభించి మన పతనానికి దారితీస్తుంది. ఉన్నత స్థితి నుండి క్రింద స్థితికి దిగజారిపోతాం.

కాబట్టి ఎట్టి పరిస్థితులలోనూ మీరు టి.వి.లు, సెల్‌లో యూట్యూబ్, గూగుల్ ద్వారా లేక వ్యక్తుల ద్వారా ఈ భావాలకు సంబంధించిన వాటికి దూరంగా ఉండండి. టి.వి.లు, సినిమాలు, యూట్యూబ్‌లలో ఆ భావాలున్న వాటిని చూడకండి.

ఇది డాక్టర్ లిప్టన్ సైంటిఫిక్‌గా ప్రూవ్ చేసింది. సాంకేతికపరంగా నిరూపించాడు డా॥ లిప్టన్, డి.ఎన్.ఎ. పరిశోధనలో.

మనిషి తన మూలస్థితి నుండి ఎలా వచ్చాడు, వారికి ఆ స్థితి ఎలా వచ్చింది. మనిషి తన అవగాహనను (అండర్‌స్టాండింగ్ లెవెల్)ని ఎలా పెంచుకోవాలి. తద్వారా జన్మలను ఎలా తగ్గించుకోవాలి అనేది ముఖ్యం. చాలామంది మాకంతా తెలుసు, మీరు చెప్పనవసరం లేదు అంటారు. కొంతమంది అయితే నా అనుభవమంత వయస్సు లేదు, నువ్వు చెప్పే వాడివా! అంటారు, అదే అజ్ఞానం అంటే.





అజ్ఞానం మూడు విధాలుగా ఉంటుంది : 1) ఎమోషనల్ ట్రేప్స్ (భావోద్రేకాలు, సెంటిమెంట్స్), 2) స్పిరిట్యుయల్ ట్రేప్స్ (ఇవి చక్రాలలో ఉండే ట్రేప్స్), 3) సైకలాజికల్ ట్రేప్స్ (ఇవి మూఢ నమ్మకాలు).

ప్రతి మనిషిలో ఉన్న బలహీనత ఏమిటంటే తన ఎమోషన్స్ (భావోద్వేగాలు) కంట్రోల్ చేసుకోలేకపోవడం. ఉదా : కోపం ఒక ఎమోషన్. కోపమే పాపము. పాపమే నరకం అన్నాడు అన్నమాచార్య.

“త్రివిధం నరకం స్యేదం తదా కామక్రోధ లోభ” అన్నాడు శ్రీకృష్ణుడు.

అరిషట్‌వర్గాలన్నీ ఎమోషన్స్, అహంకారం, మాత్సర్యం (అసూయ), ద్వేషం, లోభం, మోహం మొ॥ నవి.

వీటిని అర్థం చేసుకొని, మన అవగాహనను అంటే పెర్‌సెప్షన్‌ను పెంచుకొని, అంటే మన మనస్సును వీటికి అతీతంగా తీసుకొని వెళ్ళగలగటం. ఎదుటివాడు కారణం వుందో, కారణం లేకుండానో కోప్పడ్డాడు లేక తిట్టాడు అనుకుందాం. మనం వెంటనే రియాక్ట్ అయి కోప్పడినా, తిట్టినా దీనిని ఎమోషనల్ ట్రేప్ అంటారు. అలా కాకుండా నా మనస్సును వీడి మనస్సుకన్నా అతీతంగా, ఉన్నతంగా ఉంచుతాను, తిట్టను అనుకొంటే ఎమోషనల్ ట్రేప్ నుంచి బయటపడ్డారని అర్థం. ఇక్కడ కర్మ రాదు, మీ కర్మ వాడికి వెళుతుంది. మీ మనసు నిర్మలమవుతుంది. అలాగే మిగతావి కూడా.

## 5.0 ఆధ్యాత్మికతపై శాస్త్రజ్ఞుల అభిప్రాయాలు, వివరణలు

సైన్సు పరంగా విశ్వాన్ని ఈ విధంగా అర్థం చేసుకోవాలి. పరమాత్మ విశ్వచైతన్యం. అంటే యూనివర్సల్ కాన్షియస్‌నెస్. దీనినే కాస్మిక్ ఎనర్జీ అంటాం. కాశ్మిక్ శక్తి అంటాం. న్యూటన్ శాస్త్రవేత్త పరిశోధనల ప్రకారం ఎనర్జీ (శక్తి)ని మనం నాశనం చేయలేం కాని ఎనర్జీని ఒక రూపం నుండి మరొకరూపంలోకి మార్చవచ్చు. అలాగే ఎనర్జీని మనం సృష్టించలేం.

ఉదా : నీరు ఘనీభవించితే ఐస్‌గా మారుతుంది. అదే నీరు వేడి

చేస్తే ఆవిరిగా మారుతుంది. కాని ఆవిరి కొంతసేపటికి గాలిలో కలిసి పోతుంది. ఆ తర్వాత ఆవిరి మనకు కనపడదు. నీరు, ఐస్ కంటి ముందు చూసింది. మరిప్పడు లేదు. అంటే అది లేదు కాబట్టి నశించిందని చెప్ప గలమా! లేదు. అది తేమ రూపంలో గాలిలో ఉంది. అది మనకు కనిపించదు. అలాగే నీటిలో విద్యుత్, సూర్యకాంతిలో విద్యుత్ మనకు కనిపించవు. ఇది పదార్థ సమ్మేళనం. అందుకే ఐన్‌స్టీన్ ..... అన్నాడు. 'ఇ' అంటే ఎనర్జీ, 'ఎమ్' అంటే మాస్, 'సి' అంటే వేగం (లేక వెలాసిటీ), మాస్ అంటే మెటీరియల్. ఆ మెటీరియలే భూమి, నీరు, అగ్ని, వాయువు, స్పేస్ (ఆకాశం) వాటితో ఏర్పడినదే. ఈ దేహం, దేహంలో ఉన్న ఆత్మయే స్వయం ప్రకాశమైన ఎనర్జీ. ఆత్మశరీరంలోంచి పోతే శరీరం శవం. ఎలా అయితే నీరు, ఆవిరి రూపంలో కంటికి కనపడలేదో, అలాగే ఆత్మ శరీరంలోంచి పైకి వెళ్ళిపోతుంది. మనకు కనపడదు.

భౌతిక ప్రపంచంలో మనం ఏ అణురూపంలో ఉన్నా అది పరిణామం చెంది మరల పునర్జన్మ తీసుకొంటుంది. భౌతిక ప్రపంచం నిత్యం మార్పు చెందుతూ ఉంటుంది. పుట్టుక, మరణం ఈ భూమి మీద నిత్యం జరుగు తూనే ఉంటుంది. ఈ పరిణామక్రమంలోంచి బయటపడి పునర్జన్మ లేకుండా ఉండటమే ముక్తి స్థితి. ఈ స్థితి చేరాలంటే యోగసాధన చేయాల్సింది. యోగం అంటే జీవాత్మ పరమాత్మలో కలయుట.

ఈ ప్రపంచం సైన్సు ప్రకారం శ్రుతులు, ప్రకారం మూడు సిద్ధాంతాల పైన పనిచేస్తుంది. ఇదే ప్రపంచానికి ఆధారం.

1) లా ఆఫ్ నేచర్ (ప్రకృతి సిద్ధాంతం), 2) లా ఆఫ్ కర్మ (కర్మ సిద్ధాంతం), 3) లా ఆఫ్ గివింగ్ (ఇచ్చి పుచ్చుకొనటం)

ప్రపంచానికి ఏది ఇస్తావో అదే వస్తుంది. నీకు ఉదా : ద్వేషం ఇస్తే ద్వేషం వస్తుంది, మోసగించితే మోసగించబడతావు, ప్రేమ యిస్తే ప్రేమే వస్తుంది. హింస ఇస్తే హింసే వస్తుంది, కోపం ఇస్తే తిరిగి కోపం వేరే టైమ్‌లో వేరేవాళ్ళు కోపగిస్తారు.

**(సశేషం)**





# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Sri Ramananda Prabhuji |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Yadadri Bhuvanagiri Dist, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sachidananda Sadguru Sai Vani Publications, Saidhamam, Yadadri Bhuvanagiri Dist- 508 126 |

I, Sri Ramananda Prabhuji declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2025

Sd/-

Sri Ramananda Prabhuji

# సీతాదేవి ఆకాంక్షించిన వింత సన్నెకల్లు

**- ' ' నుంచి**

శ్రీమత్ వాల్మీకి రామాయణం, తులసీ రామాయణం, కంబ రామాయణం, రంగనాథ రామాయణం మొదలైనవి రామాయణాలలో కొన్ని.

ఇవేకాక భారతీయ భాషలన్నిటిలోనూ కవులు రామాయణాలను రచించి ఉన్నారు. వాటిలో వంగ భాషలో కృత్తివాస్ రచించిన 'కృత్తివాస రామాయణం' కూడా ఒకటి.

దాన్లో చోటు చేసుకున్న ఒక ఆసక్తికరమైన సంఘటనను ఇక్కడ మనం చూడబోతున్నాం.

సీతాదేవిని రావణుడు అశోకవనంలో నిర్బంధించి ఉంచాడు. అశోక వనంలో పుట్టెడు దుఃఖంలో మునిగి వున్న సీతాదేవికి విభీషణుని కుమార్తె అయిన త్రిజట అప్పుడప్పుడు వచ్చి సాంత్వన చేకూరుస్తూ ఉండేది.

ఇలా ఉండగా త్రిజట ఒకరోజు సీతాదేవితో, "అమ్మా! నేను మీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. కాస్త నాతో రండి!" అని చెప్పి, పక్కనే ఉన్న ఒక చోటుకు తోడ్కొని వెళ్ళింది.

అశోకవనంలో ఒక మూల ఉన్న సన్నెకల్లును (నూరుడు రాయి) సీతకు చూపించి త్రిజట, "దీన్ని చూడండి!" అంది.

అందుకు సీత, "ఇది సన్నెకల్లు! ఇదా నువ్వు చెప్ప వచ్చిన ముఖ్యమైన విషయం?" అంది కాస్త విసుగ్గా.

అప్పుడు త్రిజట, "ఇది సన్నెకల్లే! కాని ఇది సాధారణమైన సన్నెకల్లు కాదు. దీనికొక ప్రత్యేకత ఉంది!" అని చెప్పింది.

ఇది విని సీత, "నువ్వు ఏమంటున్నావు? ఇదొక సన్నెకల్లు.. దీన్లో అలా ఏం ప్రత్యేకత ఉంది?" అని అడిగింది.

త్రిజట అప్పుడు ఇలా వివరించింది : "ఈ సన్నెకల్లు మీద నూరిన





దినుసుల సహజ వాసనలు అధికరించి 'ఘుమఘుమ' వాసనలు వెదజల్లుతాయి. అంతేకాక దీనిపై నూరిన దినుసుల రుచి, గుణాలు ఇనుమడిస్తాయి".

ఈ మాటలు విన్న సీతాదేవి మనస్సులో 'శ్రీరామునితో నేను లంక నుండి అయోధ్యకు తిరిగి వెళ్ళేటప్పుడు ఈ సన్నెకల్లును తీసుకుపోవాలి!' అనే ఆలోచన మెదలింది.

కొత్త, వింత వస్తువులను చూసినప్పుడు సామాన్యంగా స్త్రీలకు జనించే ఆకాంక్ష, సన్నెకల్లు విషయంలో సీతకు అప్పుడు కలిగింది.

అచిరకాలంలోనే రాముడు లంకపై దండెత్తి రావణుణ్ణి హతమార్చాడు. లంక రాముని హస్తగతమైంది. తరువాత రాముడు లంకా రాజ్యాన్ని విభీషణునికి దానం చేసి, అతణ్ణి లంకకు రాజుగా అభిషిక్తుణ్ణి గావించాడు.

విభీషణుని పట్టాభిషేక మహోత్సవం పూర్తి కాగానే, అందరూ అయోధ్యకు బయలుదేరడానికి సన్నద్ధులయ్యారు. ప్రయాణ ఏర్పాట్లు హుటాహుటిన చెయ్యనారంభించారు.

అప్పుడు సీతాదేవికి ఆ సన్నెకల్లు విషయం జ్ఞాపకానికి వచ్చింది.

వెంటనే ఆమె హనుమంతుణ్ణి పిలిచి సన్నెకల్లును చూపించి, "ఆంజనేయా! ఈ సన్నెకల్లు ప్రత్యేకత గూర్చి త్రిజట మునుపు నాకు చెప్పింది" అంటూ త్రిజట చెప్పిన విషయం చెప్పి, మళ్లీ "ఈ సన్నెకల్లును మనం అయోధ్యకు మనతో తీసుకుపోవాలి. నువ్వు సంజీవనీ పర్వతాన్ని పెకలించినప్పుడు చూపిన మోటతనాన్ని చిన్నదైన ఈ సన్నెకల్లు మీద చూపితే ఇది పగిలి ముక్కలవుతుంది. కాబట్టి నెమ్మదిగా, జాగ్రత్త నేల నుండి ఈ సన్నెకల్లును పెకలించాలి!" అని ఆదేశమిచ్చింది.

వెంటనే ఆంజనేయుడు నేల మీద కూర్చుని, నేలలో పాతుకుపోయిన సన్నెకల్లును పెకలించడానికి దాని చుట్టూ మెల్లగా నేలను తవ్వసాగాడు.

అప్పుడు అక్కడకు వృద్ధుడూ, అమిత గౌరవనీయుడూ అయిన జాంబవంతుడు వచ్చాడు.

ఆయన హనుమంతుడితో, "ఏమిటి? అందరూ అయోధ్యకు బయలు దేరబోతున్నారు! నువ్వెందుకు ఇప్పుడు ఈ రాయిని పెకలించడానికి తాపీగా ఇక్కడెందుకు కూర్చున్నావు?" అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

అందుకు హనుమంతుడు, "సీతాదేవి, 'ఈ సన్నెకల్లును అయోధ్యకు తీసుకుపోవాలి! దీన్ని పగులకొట్టకుండా జాగ్రత్తగా పెకలించు' అని ఈ పని పురమాయించింది. అందువల్ల జాగ్రత్తగా ఈ రాయిని తవ్వి తీస్తున్నాను" అని జవాబిచ్చాడు.

ఆ జవాబు విని జాంబవంతుడు, "ఏమిటి? స్వయంగా సీతాదేవి ఇలా చెయ్యమని నీతో చెప్పిందా?" అని అడిగి, తిన్నగా సీతాదేవి వద్దకు వెళ్ళాడు.

సీతాదేవితో, జాంబవంతుడు, "అమ్మా! అక్కడ చూడండి .... ఆంజనేయుడు ఒక సన్నెకల్లును పెకలించడానికి కూర్చున్నాడు! అడిగితే, స్వయంగా మీరే ఈ పని చెయ్యమని చెప్పారు అని చెప్పాడు ....." అన్నాడు.

అది విని సీతాదేవి, 'నేను ఆంజనేయునికి పురమాయించిన పనిలో ఈ జాంబవంతుడు తల దూరుస్తున్నాడు!' అని మనస్సులో అనుకొంది.

కాబట్టి ఆమె కాస్త కోపంతో, "అది వింత సన్నెకల్లు" అని త్రిజట నాతో చెప్పింది. అందుకే దాన్ని నేను అయోధ్యకు తీసుకుపోవడానికి పెకలించి తియ్యమని ఆంజనేయునితో చెప్పాను. ఇందులో ఏం తప్ప ఉంది?" అని అడిగింది.

వెంటనే జాంబవంతుడు రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, "అమ్మా, మీ పతిదేవుడు శ్రీరాముడు లంకను విభీషణుడికి దానంగా ఇచ్చి వేశాడు. ఇది మీకూ తెలుసు.

"దానం ఇచ్చిన వ్యక్తి. దానం పుచ్చుకున్న వ్యక్తి నుండి ఏ వస్తువునూ మళ్ళీ పొందరాదు. ఒకవేళ దానం పుచ్చుకొన్న వ్యక్తే ఇష్టపడి ఏదైనా ఇవ్వ గోరినా, దానం ఇచ్చిన వ్యక్తి ససేమిరా పుచ్చుకోకూడదు. అలా పుచ్చుకుంటే, దానం చేసిన పుణ్యం హరించుకుపోతుంది.



సాయి వాణి

"ఆ విధంగా చూస్తే శ్రీరాముడు, విభీషణునికి దానం ఇచ్చి పొందిన గొప్ప పుణ్యాన్ని, ఈ అల్పమైన సన్నెకల్లు నశింపజేస్తుంది అని భావిస్తున్నాను" అని వివరించి చెప్పాడు.

జాంబవంతుడు వినయంగా తెలియపరచిన వాస్తవం సీతకు ఠక్కున అవగతమైంది. కృతజ్ఞతాభావంతో ఆమె నయనాలు చెమ్మగిల్లాయి.

అప్పుడు ఆమె జాంబవంతుడితో గద్గదస్వరంలో, "సరైన సమయంలో మీరు ఇక్కడకు వచ్చి, నాకు వాస్తవాన్ని స్పష్టంగా తెలిపి పాపకార్యానికి పాల్పడకుండా నన్ను రక్షించారు. మా పుణ్యం మీ వలన చెక్కు చెదరలేదు..." అని చెప్పింది.

అప్పుడు అక్కడకు వచ్చిన హనుమంతుడు నవ్వుతూ జాంబ వంతుడితో, "చెప్పవలసిన వారికి, చెప్పే అర్హత గల వారు సముచిత రీతిలో చెప్పాలి. 'కరిగించే వారు కరిగిస్తే రాయీ కరుగుతుంది' అంటారు. అది ముమ్మాటికీ సత్యమని మీ మూలంగా ఇక్కడ తెలుసుకున్నాను' అన్నాడు.

అది విని జాంబవంతుడు, హనుమంతుడితో, "నువ్వు వివేకివి, కార్యదక్షుడవు అని రుజువుపరిచావు?" అన్నాడు ఆహ్లాదంగా నవ్వుతూ.

జాంబవంతుడు, సీతాదేవికి చెప్పిన వాస్తవం, హనుమంతుడికి ముందే తెలుసు.

అయినప్పటికీ, మాతృస్థానంలో ఉన్న సీతాదేవి ఆజ్ఞకు ఎదురు చెప్పడమూ, హితవు చెప్పడమూ ఇష్టపడని హనుమంతుడు వెంటనే ఆమె ఆజ్ఞను శిరసావహించడానికి పూనుకున్నాడు.

అంతేకాక హనుమంతుడు, వయస్సులో అందరికన్నా పెద్దవాడైన జాంబవంతుడు దీన్ని గూర్చి సీతాదేవితో మాట్లాడటం సబబు అని భావించి, తాను కిమ్మనకున్నాడు.

హనుమంతుడి ఈ చర్య ఆయనలో ఉన్న గొప్ప సంస్కారానికి అద్దం పడుతోంది కదా!

# ఎవరు సేవకులు? ఎవరు రక్షకులు?

భగవాన్ చేతి కురుపు నుండి రక్తం స్రవించడం కదలిక వల్లనేనని కొందరి అభిప్రాయం. అందువల్ల కట్టుకట్టబడ్డ ఆ చెయ్యి కదల్పరాదన్నారు. భగవాన్ ఒక్క చేత్తోనే విసురుకోవలసి వస్తోందప్పడు. ఫాను పెడతామంటే ఏ కొంచెంసేపో తప్ప ఒప్పకోవడం లేదు. ఎవరినీ విసరనీయరాయె. ఎట్లాగైనా శ్రీవారికి తెలియకుండా విసరాలని సేవకులంతా వెనకపాటుగా నుంచుని ఐదారు రోజుల నుండీ అప్పడప్పడు విసరుతూ వచ్చారు. భగవాన్నే మార్చడానికి ఎవరి వశం? "వద్దు వద్ద"ని వారిస్తూనే ఉన్నారు భగవాన్. మంచిపనే గదా అని వాళ్ళు మానలేదు. చాలావరకూ నిదానం గానే చెప్పారు భగవాన్.

24.04.1949వ తేదీన పట్నం నుండి సుందరం అనే డాక్టరు వచ్చి ఆ పుండుకు ఎక్సరే తీసి ఆ వెనుక రేడియం సూదులు వేసి కట్టు కట్టడానికి ఆరంభం చేసి వెళ్ళాడు. ఇక్కడి డాక్టర్లు నిత్యం కట్టుకట్టుతూ వున్నారు. అవి కట్టితే ఒళ్ళంతా ఉడికినట్లుంటుందట. ఎండలా విపరీతం. భగవాన్ ఎట్లా భరిస్తున్నారోగాని యథాప్రకారం ఒక చేత్తోనే విసరుకుంటూ అందరి తోనూ మాట్లాడుతూ కార్యక్రమం నడుపుతూనే వున్నారు. ఆ స్థితిలోనే ఆత్మబోధ అనువాదమున్నూ ఒకే చేత్తో వ్రాసి ముగించారు.

27.04.1949 సాయంకాలం నాలుగూ ముప్పావుకు భగవాన్ బయటికి వెళ్ళిన సమయంలో అధికార వర్గంలో చేరినవారు కొందరు (అంటే ఆశ్రమ సంబంధమైన అధికార వర్గమన్న మాట) జూబ్లీహాల్లో నిలిచి "భగవాన్ శరీరం బలహీనంగా ఉన్నది గనుక అట్టే మాట్లాడకుండా చూడాలి. అందువల్ల శ్రీవారి నెవరూ మాట్లాడించరాదని" అక్కడున్న భక్తు లందరినీ ఆజ్ఞాపించి చక్కాపోయారు. గోశాల వద్ద భగవానుకు ఈ సంగతి ఎవరో చెప్పారు గాబోలు చిరాకుగానే వచ్చి కూర్చున్నారు భగవాన్.





కూర్చోగానే వెంకటరత్నం విసరడానికి ఆరంభించాడు. భగవాన్ ఈసారి చూచీ చూడనట్లు వూరుకున్నారు ఇంకేం. ఇష్టమేననుకొని మరీ జోరుగా విసురుతూ నుంచున్నాడాతను. వేద పారాయణ ముగిసింది. భగవాన్ వెంకటరత్నాన్ని చూచి "ఇదిగో, ఈ చేష్ట ఇకనైనా విడుస్తావా? లేదా? అయిదారు దినాలుగ మీ అందరికీ చెపుతూనే వున్నాను. వింటారా? వినండి. లేకుంటే ఇకముందు ఏదీ చెప్పను. ఎవరుగాని రెండు, మూడు సార్లు చెప్పి చూస్తాను వింటారా సరే వినరూ, వెనక వారికిక ఏదీ చెప్పను. ఏమి నీ సంగతి?" అని గద్దించారు.

అతడంతటతో విసరడం ఆపి, "భగవానుకు చెమట పోస్తున్నదని విసురుతున్నా" నన్నాడు. "ఓహో! ఇంత మందిలో నా ఒక్కడికే చెమట పోస్తున్నదన్నమాట. వారందరికీ విసురుతున్నావా? అంత భక్తి వుంటే అట్లా నుంచునీ అందరికీ విసరరాదూ? అందరిలోనూ భగవాన్ లేరు గాబోలును. పుణ్యం రావాలన్న ఆశతో కొందరు సభలో నుంచుని అందరికీ విసురుతారట. నీకూ ఆ ఆశ వుంటే అట్లా నుంచుని అందరికీ విసురు బాబూ పుణ్యం వస్తుంది" అన్నారు భగవాన్. ఇంతలో ఇంటికి వద్దామని లేచా నేను. భగవాన్ చూచి "ఇదుగో చూడూ వీడి చేష్టలు రోజూ వద్దని చెపుతూనే వున్నాను, వినడు. వాడి ఇష్టప్రకారంగానే ఉండాలన్నమాట. ఒక్కొక్కరికీ ఇదే అభిప్రాయం. వాళ్ళకు నేను వశపడి వుండాలి. వాళ్ళు చెప్పినట్లు వినాలి. మాట్లాడమంటే మాట్లాడాలి. కూడదంటే కూడదు. వాళ్ళందరినీ మాట్లాడవద్దని అనకపోతే నన్నే మాట్లాడకూడదని ఆజ్ఞాపించ రాదూ? వీరంతా స్వామికి అలసట కాకుండా కాపాడుతారట. అంతా నాకు రక్షకులే. వీళ్ళే రక్షించేది. పాపం అంగరక్షకులు" అంటూ ఏమేమో ఏకరువు పెట్టారు భగవాన్.

వెంకటరత్నం ఏదో బదులు చెప్పబోతూ ఉంటే "పొరపాటయిందని ఒప్పకోరాదా!" అని నేనతనితో అనబోయి "పొరపాటు" అన్నమాట నా

నోట వచ్చేసరికి భగవానందుకొన్నారు. "పొరపాటా?" చిన్న పిల్లడు. పాపం పాలు త్రాగుతున్నాడు. నోట్లో వేలు పెడితే కొరకలేడు. తెలియకనా చేస్తాడు వీడు. తానూ అందరితో చేరాడు. మొదటిసారి గనుక చెపుతున్నాను. వింటే వింటాడు. వినకపోతే పోతాడు. మనకేమీ?" అంటూ ఎంతోసేపు నేను కూర్చునేట్ల చేసి విరామం లేకుండా తామే మాట్లాడిస్తూ ఎన్నో విషయాలు మాట్లాడసాగారు భగవాన్. సాయంకాలం భగవానుని పలుకరించరాదని బోధించిన వారంతా పక్కపక్కలకు జారి కుక్కిన పేనుల వల్లే కూర్చున్నారు.

ఆడవారుండదగిన వేళ అతిక్రమించటం వల్ల భయపడుతూ లేచా నేను. భగవాన్ గడియారం చూచి తమ దృష్టి పక్కనున్న మరొక భక్తుని వైపు తిప్పారు. నమస్కరించి నేనింటికి వచ్చాను. రాత్రి భోజనశాలలో గంట కొట్టేవరకూ భగవాన్ దానిని గురించి ఒకే ధారగా మాట్లాడుతూనే వున్నారట. ఈ త్యాగమూర్తికి, ఈ జగద్రక్షకునకు ఎవరు సేవకులు? ఎవరు రక్షకులు?

బాలవాణి

## ఇస్తేనే వస్తుంది

– మాతాజీ

"పళ్లోయమ్మ పళ్లో! నేరేడు పళ్లో, తియ్య నేరేడు పళ్లో!" దూరంగా కేక విన్పించగానే ముంగిట్లో ఆడుతున్న పిల్లలందరూ తమ తమ ఇళ్లల్లోకి పరుగెత్తారు. అమ్మలనడిగి పళ్లు కొనిపించుకోవాలిగా మరి! కృష్ణుడొకడే మిగిలిపోయాడు చివరికి. అతనికి నేరేడు పళ్లంటే బో.....లెడంత ఇష్టం. రాధమ్మ యమునా తీరానికి వెడితే తప్పకుండా కోసుకొచ్చి పెడుతుంటుంది. యశోదమ్మ ఎంత ఖరీదైనా సరే కొనిపెడుతుంది. మళ్లీ పళ్లమ్మ కేక వినిపించింది. తియ్యనేరేడు పళ్లో! అంటూ కృష్ణుడు ఒక్క గంతులో ఇంటి లోపలికి వెళ్లాడు అమ్మా అమ్మా అని అరుస్తూ మధ్య గది, వంట గది, పూజ గది అన్నీ వెదికాడు, యశోదమ్మ లేదు. పెరట్లోకి పరుగెత్తాడు. గోశాలలోకి ఉరికాడు. ఉరికినా ఎక్కడా లేదు యశోద. అమ్మ ఏదీ!



సాయి వాణి

ఎక్కడికి వెళ్లిందో - చెప్పకుండా మళ్లీ వీధిలో పళ్లమ్మి కేక వినిపించింది. కృష్ణుడు వీధిలోకి పరుగుతీశాడు. ఎదురింటి ఉద్ధవుడూ, పొరుగింటి సిరిదేవుడు పళ్లు కొనుకొంటున్నారు. కృష్ణుడికి ఏడుపొచ్చింది. మళ్లీ ఇంట్లోకి వెళ్లాడు. చుట్టూ చూచాడు. ఒక మూల ధాన్యపు బస్తా కన్పించింది. చిన్న కృష్ణుడు బస్తా దగ్గరికి వెళ్లి దోసిటినిండా వడ్లు తీసుకున్నాడు. వీధిలోకి నడిచాడు.

బజార్లో పిల్లలంతా పళ్లు తీసుకొని వెళ్లిపోయారు. పళ్లమ్మి బుట్ట సర్దుకొని తలమీద పెట్టుకోబోతూ ఇంకా ఎవరైనా వస్తారా అని చుట్టూ చూచింది. చిన్నికృష్ణుడు గుసగుసలాడుతూ బుడిబుడి నడకలతో వస్తున్నాడు. మొలకో ఎర్రని పంచె కట్టుకున్నాడు. తలపైన జుట్టు ముడి వేసింది. దానికో ప్రక్కన చిన్న నెమలీక గ్రుచ్చుకున్నాడు. మెడలోని ముత్యాల మాల బొజ్జ మీదికి వ్రేలాడుతూ అటూయిటూ కదులుతోంది. దోసిట్లోని వడ్లగింజలు వేళ్ల సందుల గుండా జారిపోతున్నాయి. ఆ బూరె బుగ్గలు, బుల్లి ఎర్రని నోరు, కదిలే బొజ్జా, తడబడే చిట్టి-చిట్టి అడుగులూ, పళ్లమ్మికి గుండెలో నుండీ ప్రేమ పొంగి వచ్చింది. ఎంత ముద్దుగా ఉన్నాడీ బిడ్డ, అలాగే ముచ్చటగా చూస్తూ ఉండిపోయింది.

ఇంత చిన్న పిల్లవాడు, పూతననూ, శకటాసురుడనే రాక్షసుడినీ కూడా చంపాడట, నిజమేనని చూచినవారు చెప్పారు. కానీ, యీ సపివాడిని చూస్తే 'ఇది సంభవమా?' అనిపిస్తోంది. పళ్లమ్మి అలా ఆలోచిస్తుండగానే బుజ్జి కృష్ణుడు దగ్గరకు వచ్చేసాడు.

'కాయలివ్వు' అంటూ దోసిలి ముందుకు చాపాడు. ఆ దోసిట్లో పదిహేను ఇరవై గింజలకన్నా ఎక్కువ మిగల్లేదు. పళ్లమ్మికి నవ్వు వచ్చింది. కృష్ణుడి రెండు బుగ్గలూ మెల్లగా నిమిరింది. అతని దోసిట్లోని వడ్ల గింజలు తన బుట్టలోకి వేయించుకున్నది. కృష్ణుడిని ఎత్తుకొని మనసారా ముద్దాడింది. బొజ్జమీద కితకితలు పెట్టింది. కిలకిల నవ్వాడు కృష్ణుడు.

ముగ్ధ మనోహరంగా ఉన్న ఆ నవ్వును మైమరచి చూస్తూ ఉండిపోయింది పళ్లమ్మి. నవ్వటం ఆపేసి "కాయలివ్వు!" అని చెయ్యి చాపాడు కృష్ణుడు.

'నువ్వు తెచ్చిన గింజలకు ఒక్క పండే వస్తుంది' అంది పళ్లమ్మి కృష్ణుడిని ఆట పట్టించాలని, కృష్ణుడు మూతి ముడుచుకొని 'ఇవ్వు' అన్నాడు. పళ్లమ్మి అతని చెంపలు, బొజ్జా నిమిరింది. "ఇస్తాను కన్నా! నీ దోసిలి పట్టేన్ని పళ్లిస్తాను. వడ్లు తేకపోయినా నీకు మాత్రం రోజూ కావలసినన్ని పళ్లు తెచ్చిస్తాను! మరి-రోజూ నా పిలుపు వినగానే పరుగెత్తుకు వస్తావా? అన్నది. కృష్ణుడు సరేనని తల ఊపాడు. పళ్లమ్మి మంచి మంచి పళ్లు కొన్ని ఏరి అతని దోసిట్లో పోసింది. నోరంతా తెరచి సంతోషంగా నవ్వాడు బుజ్జి కృష్ణుడు. పళ్లమ్మి వైపు ఆనందంగా చూచి, చిట్టిపొట్టి అడుగులు వేసుకొంటూ తమ ఇంటివైపు సాగిపోయాడు. అతడు కనిపించినంత మేరా ప్రేమతో చూచి, అటుపైన తన త్రోవన తాను వెళ్లిపోయింది.

కాస్సేపటికి పళ్లన్నీ అమ్మటం అయిపోయి ఇంటికి చేరుకుంది పళ్లమ్మి. గుడ్డలో మూటకట్టి తెచ్చిన డబ్బు లెక్కబెట్టుకొని పెట్టెలో దాచింది. తరువాత బుట్ట శుభ్రంగా దులిపి తెద్దామని బయటకు తీసుకువెలుతుంటే ఆమెకు చిన్ని కృష్ణుడు తెచ్చిన వడ్లగింజలు గుర్తువచ్చాయి. 'ఎంత చిట్టి చేతులో కృష్ణుడివి!' అని నవ్వుకొంటూ అతనిచ్చిన వడ్లగింజలు చేటలోకి దులిపింది. ఒక్కసారి ఆమె కళ్లు జిగేలుమన్నాయి. అక్కడున్నవి వడ్లగింజలు కావు. మేలిమి రత్నాలు. ధగధగ మెరుస్తున్న ఆ రత్నాలు చూస్తుంటే పళ్లమ్మికి కృష్ణుడి కిలకిల నవ్వులు, మెరిసే కళ్లు గుర్తు వచ్చాయి. ఆమె కళ్లల్లో నీళ్లు నిండాయి. 'ఈ పిల్లవాడికి రాక్షసులను చంపే శక్తి ఉందా?' అనుకున్నాను. ఇందాక అందుకే ఆ చిట్టితండ్రి నాకీ లీల చూపించాడు. నేను చూపిన రవ్వంత ప్రేమకు, ఇచ్చిన కాసిన్ని నేరేడుపళ్లకే ఇంత అనుగ్రహం, కరుణ చూపించాడే-ఆ స్వామి ఎంత కృపాళువో! 'నాయనా! ఇస్తేనే వస్తుంది-అని నాకు నేర్పావా?' కనులు మూసుకుని నమస్కరించింది పళ్లమ్మి.





# వివాహం-సంసారము

రుద్రమదేవికి యుక్త వయసు వచ్చింది.

ఆ రోజుల్లో చాళుక్యరాజు ఇందు శేఖరుడు నిడదవోలును పాలిస్తుండేవాడు. అతని కుమారుడు వీరభద్రునితో రుద్రమదేవి పెళ్లి చెయ్యాలనుకున్నారు. ఆ విషయం రుద్రమదేవికి చెప్పగానే -

"నాతో ద్వంద్వ యుద్ధం చేసి గెలిస్తేనే అతన్ని పెళ్లి చేసుకుంటా"నని షరతు పెట్టింది. వీరభద్రుడు బలాఢ్యుడు, సాహస వీరుడు. షరతుకు అంగీకరించి రుద్రమదేవితో యుద్ధానికి దిగాడు. ఇద్దరిదీ అసమాన వీరత్వము. వరుసగా మూడు రోజులు ద్వంద్వ యుద్ధము సాగినా జయాపజయాలు తేలలేదు. తనకంటే అతడేమీ తక్కువ కాదని గ్రహించిన రుద్రమదేవి అతనితో పెండ్లికి అంగీకరించింది.

రుద్రమదేవి-వీరభద్రుల పెళ్లి వైభవంగా జరిగింది. ప్రజలంతా ఆసక్తిగా తిలకించారు.

వారి కాపురము సజావుగా సాగినది. పెళ్లైన తర్వాత గూడా రుద్రమదేవి రాజ్యపాలనలో చురుగ్గా పాల్గొనేది. తండ్రికి, భర్తకు అన్నిరకాలుగా సహకరించేది. గణపతి దేవునికి విశ్రాంతి నిచ్చేందుకు తానే ముందుండి రాజ్యపాలన కొనసాగించేది.

**పట్టాభిషేకము**

రుద్రమదేవి దంపతులకు అందరూ ఆడపిల్లలే జన్మించారు. మగ సంతానము లేదు. దురదృష్టవశాత్తు భర్త వీరభద్రుడు అనారోగ్యముతో మరణించాడు. బాధ కలిగినా రుద్రమదేవి శోకముతో కృంగిపోలేదు.

ధైర్యాన్ని కూడగట్టుకుంది. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ రాజ్య పాలనలో ముందుకు సాగింది.

రుద్రమదేవి శక్తి సామర్థ్యాలు తెలిసిన మంత్రి శివదేవయ్య ఆమెకే రాజ్య పరిపాలన బాధ్యతలు పూర్తిగా అప్పగించాలని సలహా ఇచ్చాడు. గణపతి దేవుడు కూతురు రుద్రమదేవికి పట్టాభిషేకము చేయాలని నిర్ణయించి ఆమెతో -

"తెలుగు తేజాన్ని, కాకతీయ వంశ పరువు ప్రతిష్ఠలను కాపాడే బాధ్యత నీకప్పగిస్తున్నాను. మన రాజ్యాన్ని శత్రువుల నుండి రక్షిస్తూ ప్రజలను కన్న బిడ్డలుగా భావించి పాలించాలమ్మా" అని అన్నాడు.

అందుకు రుద్రమదేవి వినయముగా నమస్కరించి -

"నాన్నా! ఈ బాధ్యతను సంతోషంగా స్వీకరిస్తున్నాను. మన కాకతీయ వంశస్థుల దేశభక్తి నాకు బాగా తెలుసు. మన సామ్రాజ్యాన్ని శత్రువులెవరూ కన్నెత్తి చూసేందుగ్గూడా అవకాశమివ్వను" అని ప్రమాణము చేసింది.

గణపతి దేవుడు సంతోషించి రుద్రమదేవికి రాజ్య పట్టాభిషేకము చేయించాడు. కాకతీయ సామ్రాజ్యానికి మహారాణిగా చేస్తూ తానే స్వయముగా కిరీటాన్ని అలంకరించాడు. తమ వంశ పారంపర్యముగా సంక్రమిస్తున్న వీరఖడ్గాన్ని చేతికందించాడు. ఆమె పాలనలో రాజ్య విస్తరణ జరగాలని, ప్రజలు సుఖంగా ఉండాలని, రుద్రమదేవి పేరు చరిత్రపుటల్లో బంగారు అక్షరాలతో లిఖించబడాలని ఆశీర్వదించాడు. ఆ సందర్భములో సామంతరాజులు కానుకలు సమర్పించారు. దేశములోని మహిళలంతా ఆనందముతో పొంగిపోయారు.

**(సశేషం)**





**సాయిధామంలో**

# గురుదేవుల జన్మదినం





ప్రియ మిత్రులారా!

**మరో ఫాల్గుణ బహుళ విదియ మార్చి 16వతేదీ, ఆదివారం** వస్తున్నది. మన గురుదేవులు భౌతికంగా లేరిప్పుడు. వారి జన్మదినం వస్తోంది. శ్రీరాముడు లేని శ్రీరామనవమి, కన్నయ్య లేని కృష్ణాష్టమి, దత్తుడు లేని దత్త జయంతి ఎలా జరుపుకుంటామో- అలాగే మన గురుదేవుల చిచ్ఛక్తిని స్మరిస్తూ వారి జన్మదినం ఆరోజు జరుపుకొందాం. వారి ప్రేమ, కరుణ, బోధ, ప్రసన్నతలు కలబోసిన జీవితాన్ని అందరం కలిసి స్మరించుకుందాం. జ్ఞానధామంలో గురుదేవులు శయనించిన చోట తలవాల్చి నమస్కరించుకుందాం. బాధ కలిగితే ఒకరినొకరు ఓదార్చుకుందాం. అందరం ప్రేమమయులైన ఆ స్వామి పాతికేళ్ళు నడయాడిన సాయిధామానికి వచ్చి ఆయన చెంత కొన్ని గంటలు గడిపి, వారి స్మృతులు కలబోసుకొని ధన్యుల మవుదాం. కార్యక్రమం ఇలా రూపొందించుకుంటున్నాం.

| | |
|---|---|
| **మార్చి 16, 2025** ఉ. గం.8.00 | శ్రీ సాయి పూజ |
| గం. 8.30-9.30 | విష్ణు సహస్ర నామం, సాయిచాలీసా పారాయణ, భజన |
| గం. 10.00 | శ్రీ గురుదేవులకు పాదుకాపూజ, గురుసంస్తుతి |
| గం. 10.30 | భక్తుల భావ పరంపర |
| గం. 11.00 | జ్ఞానధామంలో దీపాలంకరణ |
| గం. 11.30 | ప్రవచనం, గురు నమస్కృతి |
| గం. 12.00 | మహా హారతి |
| | గురుదేవుల సంస్మరణార్థం దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ |
| మ. గం. 1-00 | అన్నప్రసాద వితరణ |

**అందరూ తరలి రండి - జ్ఞానధామాన్ని దర్శించి,**
**గురుదేవుల సంస్మరణతో పునీతులు కండి.**

**ప్రేమతో ఆహ్వానిస్తూ,**
**గురుచరణ స్మరణతో, సాయిధామం**

# కృష్ణారావు కుటుంబాన్ని రక్షించిన బాబా

- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాదు

పూనె నగరంలో 'కృష్ణారావ్ సప్తరుషి' అనే సాయి భక్తుడు నివసిస్తుండే వాడు. 1956వ సంవత్సరంలో కృష్ణారావు కొత్త కారు కొన్నాడు. అతనికి సాయిబాబా యందు అమితమైన భక్తి. మొట్టమొదటగా కొత్త కారుతో షిరిడీ యాత్ర చేసి, అక్కడే ఆ కారుకు పూజ చేయించాలని అనుకొన్నాడు. మన భారతదేశంలో ఏదైనా కొత్త వాహనం కొన్నప్పుడు తమ ఇష్టదైవం యొక్క మందిరానికి తీసుకువెళ్ళి, దానికి శాస్త్రోక్తంగా పూజ చేయించడం ఆనవాయితీ.

ఒక గురువారం నాడు కృష్ణారావు కొత్త కారులో కుటుంబ సమేతంగా బయలుదేరి మధ్యాహ్నానికల్లా షిరిడీ చేరాడు. ఆ రోజుల్లో షిరిడీలో అసలు రద్దీ ఉండేది కాదు. ఎలాంటి హడావుడి లేకుండా ఎంతో ప్రశాంతంగా ఉండేది. సమాధి మందిరం ప్రక్కనే కారు పార్కు చేశాడు. అందరు మందిరం లోపలికి వెళ్ళి దర్శించుకొన్నారు. షిరిడీలో ఉండే ముఖ్యమైన ప్రదేశాలు దర్శించి తిరిగి వచ్చారు. మందిర అర్చకుడు కొత్త కారుకు శాస్త్రోక్తంగా పూజ గావించాడు. అప్పుడు సాయంత్రం అయింది. కృష్ణారావుకు ఆ మరునాడు పూనేలో అతి ముఖ్యమైన పని వుంది. అందుకని పూజ పూర్తయిన వెంటే తిరుగు ప్రయాణం అవ్వాలనుకొన్నాడు. ఆ రోజుల్లో భక్తులెవరూ సామాన్యంగా గురువారంనాడు షిరిడీ విడిచి వెళ్ళేవారు కాదు. అదొక సాంప్రదాయం. ఈనాటికీ కొందరు ఆ ఆచారాన్ని పాటిస్తుంటారు. ఇంతలో కొందరు గ్రామస్తులు అతడి దగ్గరకొచ్చి "ఈ రోజు గురువారం. షిరిడీ విడిచి వెళ్ళవద్దు. ఈ రాత్రికి ఇక్కడే ఉండి రేపు ఉదయం బయలుదేరి వెళ్ళండి" అని సలహా ఇచ్చారు. కృష్ణారావుకు షిరిడీ గ్రామస్తులపైనుండే గౌరవం కొద్దీ ప్రయాణం విరమించుకొన్నాడు.





తరువాత సమాధి మందిరానికి వెళ్ళి శేజారతికి హాజరయ్యాడు. ఆరతి పూర్తవగానే మనసు మార్చుకొని బయలుదేరడానికి తొందరపడసాగాడు. ఇంతలో మందిర అర్చకుడు అతడి కారు దగ్గరకొచ్చి "సాహెబ్, ఈ సమయంలో షిరిడీ విడిచివెళ్ళొద్దు. మీకు మరీ అత్యవసరమై తప్పనిసరిగా వెళ్ళాలనుకొంటే, అర్థరాత్రి 12 గంటలు దాటి కొన్ని నిముషాల తర్వాత బయలుదేరండి. అప్పుడు గురువారం దాటి శుక్రవారం వచ్చినట్లవుతుంది" అని సలహా ఇచ్చాడు. కానీ కృష్ణారావు అర్చకుడి సలహాను కూడా ఖాతరు చెయ్యకుండా కుటుంబసభ్యులందరినీ కారులో ఎక్కించుకుని బయలు దేరాడు. కొన్ని క్షణాలలోనే కారు రోడెక్కింది. ఎక్కడ వీధిదీపాలు లేవు. ఎటు చూసినా చిమ్మచీకటి. కారు వెండి లైట్ల కాంతి తప్పితే మరొక ఆధారం లేదు. కారు నడుపుతూ వుంటే రోడ్డును గుర్తించడం కూడా చాలా కష్టంగా వుంది. ఆ రోజుల్లో రోడ్లు కచ్చారోడ్లు కదా! అందునా ఆ రోడ్డు పొలాల మధ్యలో వుంది. చీకట్లో ఏవో కీటకాలు, చిన్నచిన్న జంతువులు చేసే శబ్దాలు వింటూ వుంటే ఒక రకమైన భయం గొలుపుతోంది. ఇంతలో కారు హెడ్‌లైట్లు హఠాత్తుగా పనిచెయ్యడం మానేశాయి. సరికొత్త కారు హెడ్‌లైట్లు పనిచెయ్యకపోవడమేమిటో మరి! అంతేకాదు ఒక్క కుదుపుతో వాళ్ళ కారు ఏదో పొలంలో ఆగిపోయింది.

కృష్ణారావు ఎంత ప్రయత్నించినా హెడ్‌లైట్లు వెలగలేదు, కారు కూడ స్టార్టు కాలేదు. రోడ్డు మీద ఏదైనా వాహనం వస్తే ఆపి సహాయం తీసుకుందామని కృష్ణారావు రోడ్డు మీద నిలబడ్డాడు. ఒకటో, రెండో వాహనాలు వచ్చాయిగాని వాళ్ళు ఆపకుండా వెళ్ళిపోయారు. అతడు అలా రోడ్డు మీద చాలా సమయం నిరీక్షించాడు. తను చేసిన అనాలోచిత నిర్ణయానికి పశ్చాత్తాపం కలిగింది. గ్రామస్తులు, చివరకు సాయి ప్రతినిధి అయిన అర్చకుడు చెప్పినా వాళ్ళ మాటలు పెడచెవిన పెట్టినందుకు ఎంతగానో బాధపడ్డాడు. చేతులు జోడించి, "బాబా, తప్పు చేశాను, నేను,

నా కుటుంబం అందుకు నిస్సహాయ స్థితిలో వున్నాం. నన్ను మన్నించి సహాయం అందించు, ఇప్పుడు నువ్వే నాకు దిక్కు" అంటూ హృదయ పూర్వకంగా ఎంతో ఆర్తితో ప్రార్థించాడు.

ఇంతలో దూరం నుంచి ఏదో వాహనం వస్తున్నట్లుగా కన్పించింది. కృష్ణారావుకు ఆశ చిగురించింది. అదొక మిలిటరీ ట్రక్కు. ఆపమన్నట్లుగా చేయి ఊపాడు కృష్ణారావు. ట్రక్కు ఆగింది. అందులోంచి ఒక సిపాయి క్రిందికి దిగి వచ్చి ఏమిటి సమస్య అని అడిగాడు. రోడ్డుప్రక్క పొలంలో ఆగివున్న తన కారు చూపిస్తూ విషయమంతా వివరించాడు. ఆ సిపాయి ట్రక్కు లోపలికి వెళ్ళి పెద్ద ఫ్లాష్ లైట్‌తో తిరిగొచ్చాడు. ఇద్దరు కారు దగ్గర కొచ్చారు. సిపాయి కారు తాలూకు బోనెట్ పైకెత్తి వైర్లు జాగ్రత్తగా పరిశీలించి, వైరింగులో ఎలాంటి లోపం వున్నట్లు కనిపించడం లేదు అని తనలో తానే తర్కించుకొంటూ డ్రైవరు సీటులో కెక్కాడు. ఇగ్నేషన్ కీ త్రిప్పాడు. ఆశ్చర్యం! కారు స్టార్టు అయింది. హెడ్‌లైట్లు కూడా వెలిగాయి. ఇంతలో సిపాయి ఎంతో ఉద్వేగంతో అన్నాడు, "సార్ మీరు చాలా అదృష్ట వంతులు. ఒక్కసారి ముందుకు చూడండి. వ్యవసాయం కోసం త్రవ్విన పెద్దబావి. కారు ఏమాత్రం ముందుకువెళ్ళినా, మీ అందరి ప్రాణాలు గాలిలో కలిసిపోయి ఉండేవి".

కారు హెడ్‌లైట్ల వెలుగులో స్పష్టంగా కనపడుతుంటే ముందుకు చూచారు కృష్ణారావు కుటుంబం. ఎదురుగా కన్పించిన దృశ్యాన్ని చూసి అందరికీ గుండెలు గతుక్కుమన్నాయి. వాళ్ళ కారు ఆగినచోటు నుంచి కేవలం కొద్ది అడుగులు దూరంలో పెద్ద వ్యవసాయ బావి. అది నేల బావి. దాని చుట్టూ గోడ కాదు గదా కనీసం మట్టికట్ట కూడ లేదు. అసలక్కడ ఒక బావి వున్నట్లే కనిపించడం లేదు దగ్గరకొచ్చే వరకు. కారుగాని ఏమాత్రం ముందుకు వెళ్ళినా అందరం జలసమాధి అయి దుర్మరణం పాలయ్యేవాళ్ళం కదా అని భయభ్రాంతులయ్యారు. ఆ సిపాయి కారును





రివర్సు చేసి వేగంగా నడుపుకొంటూ రోడ్డు మీదికి తెచ్చి నిలిపాడు. సమయానికి ఆపద్బాంధవుడిలా వచ్చి సహాయం చేసినందుకు హృదయ పూర్వకంగా ఆ సిపాయికి ధన్యవాదాలు తెలిపారు కృష్ణారావు. తర్వాత మనం ఇప్పుడెక్కడున్నాం అని అడిగాడు. "మనం ఇంకా షిరిడీ పొలిమేరలోనే వున్నాం" అని నమ్రతగా బదులిచ్చి ట్రక్కులోకి దూకి వేగంగా నడుపుకొంటూ వెళ్ళిపోయాడు సిపాయి. ఆ రూపంలో బాబాయే వచ్చి తమను రక్షించినట్లుగా విశ్వసించాడు కృష్ణారావు.

కృష్ణారావు యథాలాపంగా చేతి గడియారం వంక చూశాడు, 12.05 అయింది. అంటే అర్థరాత్రి దాటి 5 నిముషాలు, అనగా శుక్రవారం అన్నమాట. షిరిడీ వైపుకి తిరిగి మరోమారు చేతులు జోడించి బాబాకి నమస్కరించాడు. ఇంక చెప్పేదేముంది? తర్వాత ప్రయాణం సజావుగా సాగి క్షేమంగా ఇల్లు చేరారందరూ. కుటుంబం అంతా బాబాకి అంకిత భక్తులయ్యారు.

బావికి కొద్ది అడుగుల దూరంలోనే కొత్త కారు తాలూకు హెడ్‌లైట్సు పనిచేయకపోవడమేమిటి? కారు ఆగిపోవడం ఏమిటి? సిపాయి కారుకు ఎలాంటి మరమ్మత్తులు చెయ్యకపోయినా, అతడు స్టార్ట్ చెయ్యగానే స్టార్ట్ అవ్వడమేమిటి? లైట్లు వెలగడం ఏమిటి? కృష్ణారావు సాయిని వేడుకోగానే మిలటరీ ట్రక్కు రావడం ఏమిటి? అందులో కేవలం ఒక్క సిపాయి మాత్రమే వుండడం ఏమిటి? ఇదంతా ఆ ఆపద్బాంధవుడి సాయి లీల. సాయి తన భక్తులను కాపాడే విధానం అద్వితీయం, అనుపమానం. ఎప్పుడు ఏ భక్తుణ్ణి ఎలా రక్షించాలో అందుకు ఏ వేషం ధరించాలో ఆ సాయి పరమాత్ముడికే ఎరుక!

**జై సాయిరాం!**

**- సాయి సాగర్, నవంబర్-2010**